నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 1 ఏప్రిల్ 2024 | HYDERABAD





## ఈస్టర్ సైక్లింగ్ రైడ్

సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ ) : ఈస్టర్‌ను పురస్కరించుకొని ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్‌కాలేజీలో హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ ఆధ్వర్యంలో ఈస్టర్ రైడ్ నిర్వహించారు. ఇందులో సైక్లిస్టులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. సైక్లింగ్‌ను ప్రోత్సహించడంలో భాగంగా రైడ్ ఏర్పాటు చేసినట్టు ఆ సంస్థ ఫౌండర్ రవీందర్ తెలిపారు.



## ఎమ్మెల్సీ వాణీదేవికి ఘనస్వాగతం

బేగంపేట్, మార్చి 31 : ఢిల్లీలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు 'భారత రత్న' అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని నగరానికి వచ్చిన ఎమ్మెల్సీ వాణీదేవికి ఎయిర్‌పోర్టులో బంధుమిత్రులు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే మహేశ్వరం నియోజకవర్గం బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు సన్మానించారు.

## 50 శాతం జరిమానాతో ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణ

సిటీబ్యూరో: గ్రేటర్‌లోని ట్రేడర్లు తమ లైసెన్స్‌లను ఈ ఏడాదికి పునరుద్ధరించుకోకుంటే జరిమానాలు తప్పవని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరించారు. గతేడాది డిసెంబర్ 31తో ట్రేడ్ లైసెన్స్ గడువు ముగిసిందని, జనవరి 31 వరకు అవకాశం ఇచ్చామని, ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు 25 శాతం జరిమానాతో పునరుద్ధరించినట్లు చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి లైసెన్స్‌లను పునరుద్ధరిస్తే రెన్యువల్ దరఖాస్తులపై అదనంగా 50 శాతం అపరాధ రుసుము వసూలు చేయనున్నట్లు తెలిపారు.

## సాగర్ మురుగు శుద్ధికి

### 3 చోట్ల 'సీవరేజ్' ప్లాంట్లు

సిటీబ్యూరో: హుస్సేన్‌సాగర్‌లోకి వచ్చే మురుగునీటిని శుద్ధి చేసే ప్రక్రియ నిరంతరం కొనసాగుతోందని, ఇందుకోసం 3 చోట్ల సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. 'కంపుకొడుతున్న హుస్సేన్‌సాగర్' పేరుతో ఆదివారం 'నమస్తే'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ మూడు చోట్ల సీవరేజ్ ట్రీట్ ప్లాంట్లు ఉన్నాయని, ఒకటి పికెట్ నాలపై 30ఎంఎల్‌డీ, బల్కాపూర్ నాలాపై 20 ఎంఎల్‌డీ, రంగధాముని లేక్ వద్ద మరో 5 ఎంఎల్‌డీల సామర్థ్యంతో ఎస్‌టీపీలను ఏర్పాటు చేసి, మురుగునీటిని శుద్ధి చేసి సాగర్‌లోకి వదులుతున్నామన్నారు. 2012 నుంచే వీటి నిర్మాణం చేపట్టి నిర్వహిస్తున్నామని, అదేవిధంగా హుస్సేన్ సాగర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో 7 చోట్ల ఐ అండ్ డీలను ఏర్పాటు చేసి మురుగునీటి పారుదలను పర్యవేక్షిస్తున్నామన్నారు.





పాదయాత్రలో భాగంగా స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# పజ్జన్న.. ప్రజానేత

## 24 గంటలు అందుబాటులో ఉంటరు

- ఢిల్లీ పర్యటనలు చేసే నాయకులు మనకొద్దు
- ఐదేండ్లలో కిషన్‌రెడ్డి చేసిందేమీలేదు
- సికింద్రాబాద్‌పై ఎగిరేది గులాబీ జెండానే
- అంబర్‌పేటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు

సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ) :సికింద్రాబాద్ ఎంపీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఐదేండ్లలో చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కిషన్ రెడ్డి హైదరాబాద్ నగరానికిగానీ తెలంగాణకు గానీ ప్రత్యేకంగా తీసుకువచ్చిన అదనపు ప్రాజెక్టుగానీ, ఒక్క రూపాయి అదనపు నిధులు కానీ ఏం లేవని కేటీఆర్ మండిపడ్డారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రజల చేతిలో తిరస్కారానికి గురైన తర్వాత, అదృష్టవశాత్తు గత ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి ఎంపీగా గెలిచారని కేటీఆర్ అన్నారు. గెలిచిన తర్వాత పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు మద్దతుగా అంబర్‌పేట నియోజకవర్గంలో ఆదివారం కేటీఆర్ పాదయాత్ర నిర్వహించారు. కిషన్ రెడ్డికి దమ్ముంటే ఐదేండ్లలో తీసుకువచ్చిన నిధులు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందు ఉంచి ఈ ఎన్నికల్లో ఓట్లు అడగాలని కేటీఆర్ సవాల్ విసిరారు. గత ఎన్నికల్లో అనుకోకుండా గెలిచిన కిషన్ రెడ్డి, ఈసారి మాత్రం కచ్చితంగా ప్రజల చేతిలో తిరస్కారానికి గురవుతారని, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంలో ఆయన ఓటమి ఖాయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. పదేండ్లలో హైదరాబాద్ నగరానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గుర్తుంచుకొని, తమ పార్టీ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కి మద్దతు ఇవ్వాలని కేటీఆర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గెలిచిన తర్వాత అధికారం కోసం ఢిల్లీకి పర్యటనలు చేసే నాయకులను కాకుండా, నిత్యం 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండే పద్మారావు గౌడ్ వంటి ప్రజా నాయకులు అవసరమని కేటీఆర్ అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గులాబీ పార్టీకి మద్దతు ఇవ్వాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంలో గులాబీ జెండానే ఎగురుతుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.



### ఆప్యాయంగా పలకరిస్తూ...

అంబర్‌పేటలోని ప్రేమ్ నగర్ నుంచి ఆజాద్ నగర్ , పటేల్‌నగర్‌లలో ఇంటింటికీ తిరిగిన కేటీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. ప్రజలతో మమేకమైన కేటీఆర్..వారిని ఆప్యాయంగా పలకరించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ సారు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చారని కొందరు... దళిత బంధు పథకంతో దర్జాగా బతుకుతున్నామని ఇంకొందరు.. బీసీ బంధుతో ఉపాధి పొందుతున్నామని మరి కొందరు తెలుపగా.. కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. చిరువ్యాపారులతో ముచ్చటించారు. పద్మారావు గౌడ్‌ను ఎంపీగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠా గోపాల్ , స్థానిక కార్పొరేటర్లు, ముఠా జై సింహ తదితరులు పాల్గొన్నారు.



## పాదయాత్ర చేసి.. సమస్యలు తెలుసుకొని..

మల్కాజిగిరి: మచ్చ బొల్లారం డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా పాదయాత్ర చేశారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ కార్పొరేటర్ మురుగేశ్, డోలి రమేశ్, జీకే హన్మంతరావు, మధుసూదన్‌రెడ్డి, పరమేశ్, లక్ష్మణ్‌యాదవ్, వెంకటేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# హాజరు పట్టిక.. ఇక పక్కాగా..

- నేటి నుంచి 'ఫేషియల్ రికగ్నిషన్'
- నకిలీ సింథటిక్ ఫింగర్ ప్రింట్స్ నేపథ్యంలో
- బల్దియా కీలక నిర్ణయం
- అక్రమాలకు శాశ్వత చెక్

సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో పారిశుద్ధ్యం, ఎంటమాలజీ విభాగాల్లో అక్రమాలకు శాశ్వత చెక్ పెడుతూ సరికొత్త విధానాన్ని తెరపైకి తెచ్చారు. కార్మికుల అటెండెన్స్‌లో ప్రస్తుతం అమలవుతున్న ఫింగర్ ప్రింట్ బయోమెట్రిక్ హాజరును నేటి నుంచి నిలిపివేయనున్నారు. సోమవారం నుంచి అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టంను అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన యాప్ రూపకల్పన, కార్మికుల రిజిస్ట్రేషన్ చర్యలను దాదాపుగా పూర్తి చేశారు. నకిలీ సింథటిక్ ఫింగర్ ప్రింట్స్ తయారు చేసి.. హాజరు నమోదు చేస్తూ ..అక్రమాలకు తెరలేపారు. శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎస్ఎఫ్ఏ)ల నుంచి ఉన్నతాధికారుల వరకు ఈ అక్రమాల బాగోతాలకు తెరలేపిన నేపథ్యంలో కమిషనర్.. దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలోనే అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఫేషియల్ రికగ్నిషన్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టంను అమలు చేస్తున్నారు. ఇందులోభాగంగానే మొబైల్ ఫోన్‌తో వినియోగించగలిగే ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌లో కార్మికుల పేర్లు, ఐడీ, ఆధార్ వివరాలు పొందుపర్చారు. ఈ యాప్‌లో హాజరు తీసుకునే సమయంలో కార్మికులున్న ప్రదేశాన్ని జియో ఫెన్సింగ్‌తో తెలుసుకునే సౌకర్యం ఉంటుంది. పారిశుద్ధ్యం ఎంటమాలజీ, వెటర్నరీ విభాగాల్లోని దాదాపు 25వేల మంది కార్మికులు, సంబంధిత అధికారుల హాజరును దీని ద్వారానే తీసుకుంటారు. ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్‌తో విధుల్లో రోజుకు ఎంతమంది హాజరవుతున్నారు? అక్రమంగా జీతాలు విడుదల అవుతున్నాయా? అనేది తెలుసుకునే వీలుంటుంది.

# నడినెత్తిపై ముప్పు..!

- కరెంటు స్తంభాలపై వేలాడుతున్న కేబుళ్లు
- ప్రమాదకరంగా మారుతున్నా..పట్టించుకోని అధికారులు

సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ): నగరంలో విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేస్తున్న కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్, టెలిఫోన్ వైర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. విద్యుత్ స్తంభాలపై కేవలం 4 వరుసలతో మాత్రమే కరెంటు తీగలు ఉంటే.. ఆ స్తంభాలపై 20 నుంచి 30 వరుసలతో కూడిన కేబుల్ వైర్లు వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఇవి ప్రమాదంగా మారుతుండటంతో నగర ప్రజలతో పాటు ఆయా ప్రాంతాల్లోని వ్యాపారులు తరచూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి దుమారానికి విద్యుత్ తీగలు తగిలినప్పుడు మెరుపులు వచ్చి అవి కేబుళ్ల మీద పడి..మంటలు వస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు ప్రధాన రహదారుల మీదే జరుగుతుండటంతో వాహనదారులు, పాదచారులు నిత్యం భయాందోళనలకు గురవుతున్నారు.

### సమన్వయం కరువు...

నగరంలో కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా ప్రైవేటు సంస్థల పరిధిలోనే ఉంది. కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్, టెలిఫోన్ సర్వీసు ప్రొవైడర్లు ఎవరికీ వారుగా తమకు కంపెనీకి చెందిన 20 నుంచి 30 తీగలను విద్యుత్ స్తంభాలకు వేలాడదీస్తూ ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయంలో మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి అభ్యంతరాలు చెప్పకపోవడంతో ఇష్టారాజ్యంగా కేబుళ్లు ఏర్పాటవుతున్నాయి. విద్యుత్ శాఖకు చెందిన స్తంభాలపై కేబుళ్లు ఏర్పాటు చేసేందుకు.. ఆ శాఖ నుంచి అనుమతి కూడా తీసుకోవడం లేదు. అదేవిధంగా మున్సిపల్ కార్పొరేషన్ సైతం ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో కేబుళ్లు విపరీతంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయంలో సమన్వయంతో వ్యవహరించాల్సిన ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

### మరమ్మతులకు ఇబ్బందులు...

విద్యుత్ సిబ్బంది స్తంభాలను ఎక్కి మరమ్మతులు చేయాల్సి వచ్చినప్పుడు కుప్పలు తెప్పలుగా ఉంటున్న కేబుల్ తీగలు అడ్డంకిగా మారుతున్నాయి. భారీ క్రేన్‌లను తెప్పించి కేబుళ్లు తగలకుండా పనులు చేయాల్సి వస్తోందని, అయినా ఆ సమయంలో అవి తమ క్రేన్స్‌కు అడ్డుగా వస్తున్నాయని విద్యుత్ శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. దీనికితోడు భారీ వాహనాలు వెళ్లినప్పుడు కిందకు వేలాడుతున్న కేబుళ్లు తెగి.. విద్యుత్ వైర్లకు తాగి..మెరుపులు కూడా వస్తున్నాయి. దీంతో ఆ మార్గంలో వెళ్లే వారు కేబుళ్లు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు.

## మూసీ హైడ్రాలిక్స్ మోడల్స్ కోసం టెండర్ గడువు పొడిగింపు



సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా హైడ్రాలిక్స్ మోడల్స్ రూపకల్పన కోసం పిలిచిన టెండర్ గడువు ఏప్రిల్ 6 వరకు పొడిగించారు. నగరం మధ్యలోంచి పారుతున్న మూసీ నది మురికి కూపంగా మారింది. దీన్ని పూర్తి స్థాయిలో సుందరీకరణ చేసేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్)ను ఏర్పాటు చేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకొంది. 3 ఏండ్లలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో భాగంగా గండిపేట, హిమాయత్‌సాగర్‌ల నుంచి ప్రారంభమయ్యే నదుల ప్రవాహ ప్రాంతాలను సమగ్రంగా అధ్యయనం చేసి అవసరమైన నివేదికలను రూపొందించేందుకు 'సిమ్యులేషన్ మోడల్ ఫర్ హైడ్రాలిక్స్' పేరుతో టెండర్లను పిలిచింది. అనుభవం కలిగిన కన్సలెంట్ల ఎంపిక కోసం టెండర్లను ఏప్రిల్ 6 వరకు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో ఎంఆర్‌డీసీఎల్ బృందం అధికారులు డ్రోన్ సర్వేను చేపడుతున్నారు. ఈ సర్వే ద్వారా వచ్చిన డేటాను ఉపయోగించి మూసీ నది ప్రవాహం తీరును అంచనా వేసి, ఎంపిక చేసిన కన్సల్టెంట్‌లు నివేదికలను రూపొందిస్తారని అధికారులు తెలిపారు.

# రైట్..రైడ్.... ఓకే చలో




**ఓలా, ఉబర్, ర్యాపిడోలకు పోటీగా మరిన్ని యాప్‌లు**

- రైడ్ ధరను తగ్గించుకునే వెసులుబాటు
- డ్రైవర్లకు సైతం ఉపయోగకరంగా విధానం

సిటీబ్యూరో, మార్చి 31 ( నమస్తే తెలంగాణ ) : సాధారణంగా క్యాబ్ సర్వీస్‌లో ఫేర్ ఎంత చూపిస్తే అంత చెల్లించాల్సిందే. కానీ ఇప్పుడు అగ్రిగేటర్స్ మధ్య ఉన్న పోటీతో వినియోగదారులకు మరింత సులభతర సేవలు అందించేందుకు సంస్థలు పోటీపడుతున్నాయి. నిర్ణయించిన రైడ్ ధరను సైతం తగ్గించుకునే వెసులుబాటు కల్పిస్తూ 'ఓకే చలో' యాప్ సేవలు అందిస్తున్నాయి.

### రైడ్స్ స్వీకరించేందుకు డ్రైవర్ల ఆసక్తి

సికింద్రాబాద్ నుంచి బంజారాహిల్స్ వరకు క్యాబ్ రూ.220 చూపిస్తే కొత్తగా వచ్చిన వాటిలో రూ. 200 మాత్రమే చూపిస్తుంది. ప్రస్తుతం హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మియాపూర్, కూకట్‌పల్లి, ఔటర్ రింగురోడ్డు, ఐటీ కారిడార్లు చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త క్యాబ్ సర్వీసులు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి. అలాగే శంషాబాద్ విమానాశ్రయం వద్ద కూడా ఈ సేవలు ఉన్నాయి. గతంలో కేవలం ఓలా, ఉబర్ మాత్రమే సర్వీసులు ఇస్తుండటంతో కమీషన్ల రూపంలో డబ్బులు కట్ అయ్యేవని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రైడ్స్ సైతం రద్దు చేశారు. కానీ ఇప్పుడు కొత్త యాప్స్‌తో డ్రైవర్లు రైడ్స్ స్వీకరించేందుకు ఆసక్తి కనబరుస్తుండటం విశేషం.

బేగంపేట నుంచి పంజాగుట్టకు క్యాబ్ ధర రూ. 110 చూపిస్తే అందులో కస్టమర్ తాను అనుకున్న అమౌంట్‌ను ఎంటర్ చేస్తే సరిపోతుంది. అందులో సదరు సంస్థ అతి తక్కువలో ఎంతకొస్తదో చూపిస్తుంది. అలా సంస్థ కస్టమర్‌ను దృష్టిలో పెట్టుకుని మార్పులు చేసింది. దీంతో పాటు ఓల్టా వంటివి దూర ప్రయాణికులకు కూడా క్యాబ్‌లు అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా నగరంలో మనయాత్రి, యారీ, ఓల్టా, ఓకే చలో.. వంటి క్యాబ్ అగ్రిగేటర్స్ వచ్చేశాయి. దీంతో నగరవాసులు నచ్చిన క్యాబ్‌ను ఎంపిక చేసుకునే అవకాశం లభించింది. డ్రైవర్లు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారని గిగ్ వర్కర్స్ ప్రెసిడెండ్ సలావుద్దీన్ తెలిపారు. ఓలా, ఉబర్ వంటి సంస్థల్లో రోజంతా కష్టపడినా వెయ్యి రూపాయలు రావడం లేదని.. ఇప్పుడు కమీషన్లను ఎక్కువగా తీసుకోకుండా కొత్త సంస్థలు డ్రైవర్లకు బెనిఫిట్ కలిగించేలా మార్పులు తీసుకొచ్చాయని వివరించారు. అంతేకాదు ఓలా, ఉబర్‌లతో పోలిస్తే ధరలు కూడా తక్కువగా ఉన్నాయన్నారు.

**క్యాబ్‌ను ఎంపిక చేసుకునే అవకాశం..**

### ప్రపంచ శాంతి కోసం...

## అహింసా రన్

ప్రపంచ శాంతియే లక్ష్యంగా....జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్ వద్ద ఆదివారం అహింసా రన్ నిర్వహించారు. 3కే, 5కే, 10కే విభాగాల్లో నిర్వహించిన ఈ రన్‌ను తెలంగాణ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వికాస్ రాజ్, ఆర్గనైజేషన్ హైదరాబాద్ చైర్మన్ సుశీల్ సంచేటి, మహిళా విభాగం చైర్‌పర్సన్ వీణా జైన్, చీఫ్ సెక్రటరీ టీనా షా, ప్రధాన కార్యదర్శి పరేశ్ షా, కోశాధికారి బీఎల్ భండారితో కలిసి ప్రారంభించారు.

–ఖైరతాబాద్, మార్చి 31



## ఉత్సాహంగా స్ట్రీట్‌కాస్

పేద విద్యార్థులకు సహకారం అందించాలన్న లక్ష్యంతో స్ట్రీట్‌కాస్ స్వచ్ఛంద సంస్థ, పల్లవి ఫౌండేషన్, మై ఫిట్‌నెస్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో ఆదివారం ఆర్ఎఫ్‌సీ 10 పేరుతో నిర్వహించిన 5కేరన్ ఉత్సాహంగా సాగింది. అంతకుముందు స్ట్రీట్‌కాస్ సీఈవో శృతి, అధ్యక్షురాలు సాహితీతో కలిసి ఈ రన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న నిర్మాత దిల్ రాజు, నటీనటులు నవదీప్, వైష్ణవి చైతన్య విద్యార్థులను ఉత్సాహపరిచారు.

–ఖైరతాబాద్, మార్చి 31

